


కోడి బొచ్చును కూడా నెలకు రూ.20లక్షలకు అమ్ముకునే కరుణాకర రెడ్డి, ఆయన కొడుకు అభినయ్ కావాలో, టీటీపీ అధినేత చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుతో పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కావాలో తిరుపతి ప్రజలు ఆలోచించుకోవాలి.

తిరుపతికి ఓ ప్రత్యేకత వుంది. టీడీపీ ఆవిర్భావ సమయంలో ఎన్టీఆర్ పోటీ చేశారు.తర్వాత చిరంజీవి పోటీ చేశారు. నా సొంత నియోజకవర్గమైనా తిరుపతి సీటు కావాలని పవన్ అడగడంతో కాదనలేకపోయా. సామాజిక న్యాయానికి కట్టుబడి కూటమి తరపున ఆరణి శ్రీనివాసులును పోటీకి నిలబెట్టాం.

తిరుపతిలో దొంగలు పడ్డారు!

దళారీ వ్యవస్థకు అడ్డాగా తిరుమల

- పవన్ కల్యాణ్ ధ్వజం -

తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలను దళారీ వ్యవస్థకు అడ్డాగా, ఒక రిసార్ట్‌గా వైసీపీ నాయకులు మార్చేశారంటూ పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. తిరుపతిలో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ తిరుమల కొండపై లడ్డూ నాణ్యత తగ్గించేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి నెలా రెండో మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శన సౌకర్యాన్ని వైసీపీ ప్రభుత్వం తీసేసిందని, కూటమి అధికారంలోకి రాగానే దానిని పునరుద్ధరిస్తామన్నారు.తిరుమలకు ఆధ్యాత్మిక పరిమళాలను తిరిగి తీసుకొచ్చేందుకే పొత్తులో భాగంగా తిరుపతి సీటును కోరడంతో చంద్రబాబు పెద్దమనసుతో అంగీకరించారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో మన పట్టా పుస్తకాల మీద జగన్ తన ఫొటోలు వేసుకున్నాడన్నారు. చివరకు టీటీడీ ఉద్యోగులకు ఇచ్చే పట్టాలపై కూడా జగన్ నవ్వుతూ ఉండే ఫొటోలుండడం ఏడుకొండలవాడిని అవమానించడమే అన్నారు.

వైసీపీ వాళ్లిచ్చే డబ్బులు హుండీలో వేయండి

తిరుమల హుండీలో కానుకలనూ దోపిడీ చేస్తున్నారని, ప్రతి పనికీ పాలకులు పది నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని పవన్ ఆరోపించారు.కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీవారి ఖజానాకు ఆదాయం వస్తుంటే వైసీపీ నాయకులు కొండపై తిష్టవేసి ఖాళీ చేస్తున్నారన్నారు.ఆ డబ్బులతోనే ఓట్లను కొనేందుకు కరుణాకర రెడ్డి మనుషులు వస్తారన్నారు. ఫ్యాన్‌కు ఓటు వేయమని వైసీపీ నాయకులు ఇచ్చిన డబ్బును తిరిగి హుండీలో వేసేయండని పవన్ సూచించారు. దీని పర్యవసానం భవిష్యత్తులో ఆయనకు తెలుస్తుందన్నారు.కొవిడ్ సమయంలో ఆక్సిజన్ లేకుండా రుయాస్పత్రిలో 11 మంది చనిపోయారని గుర్తు చేసిన పవన్ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ సహకారంతో విద్య, వైద్య రంగాలకు నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. నగరంలోని 40కి పైగా మురికివాడలను అభివృద్ధిని చేస్తామని, యూడీఎస్‌ను బాగుచేసుకునే బాధ్యత కూటమి తీసుకుంటుందని చెప్పారు.వైసీపీ నేతల దెబ్బకు పరారైన పెద్ద పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.2009లో రాజకీయాల్లోకి వరప్రసాద్‌ను తానే ఆహ్వానించానన్న పవన్ తిరుపతి ఎంపీగా ఆయన్ను పెద్ద మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.జనసేన తరపున తిరుపతిలో పోటీచేస్తున్న ఆరణి శ్రీనివాసులును, చంద్రగిరి నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తున్న పులివర్తి నానీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

2009లో చిరంజీవిని గెలిపించారు. తిరుపతిపై ఆయనకు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలున్నాయి.నిర్వాసితులకు 1100 ఇళ్లు నిర్మించాలని చిరంజీవి ప్రతిపాదిస్తే 149 ఇళ్లుమాత్రమే నిర్మించారు.మిగిలినవి శ్లాబ్ వేయకుండా పక్కనపెట్టేశారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ ఇళ్లకు శ్లాబ్ వేయిస్తాం.

తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీలను గెలిపించాలని అభ్యర్థిస్తున్న పవన్‌కల్యాణ్



ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా వుండాలి

రోడ్‌షోలో టీడీపీ అధినేత చంద్రబాబు

తిరుపతికి తెలుగు గంగ నీటిని తెప్పించాం. గరుడ వారధి మంజూరు చేయించి పనులు ప్రారంభించాం. చంద్రగిరి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయించాం.తిరుపతిని చదువుల కేంద్రంగా తయారుచేయాలని ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ తీసుకొచ్చాం.తిరుపతి చుట్టూ టీసీఎల్, జోహో, సెల్కాన్, కార్బన్, డిక్సన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమలు తీసుకొచ్చి ఎలక్ట్రానిక్ హబ్‌గా మార్చాం.

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో దొంగలు పడ్డారని, ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా వుండాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి ఆయన తిరుపతిలో రోడ్‌షో నిర్వహించారు. నగరంలోని నాలుగు కాళ్ళమండపం కూడలిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలోనే పుట్టి పెరిగానని, ఇక్కడే చదువుకున్నానని పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు.ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన నేతగా ఎదిగానన్నారు. పాలనలో నిజాయితీగా వ్యవహరించినందుకు తనపై శత్రువులు 23 క్లైమోర్ మైన్లు పేల్చారని, అయితే వెంకటేశ్వర స్వామి తనకు పునర్జన్మ ఇచ్చారనన్నారు. సీట్ల విషయంలో సామాజిక న్యాయానికి కట్టుబడి తాము కూటమి తరపున ఆరణి శ్రీనివాసులును పోటీకి నిలబెట్టామన్నారు.అదే వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. టీటీడీ ట్రస్టు బోర్డుకు ఈ ఐదేళ్ళలో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్లుగా పనిచేశారని, చివరికి ఈవోగా కూడా ధర్మారెడ్డి వున్నారని, ఇదేనా సామాజిక న్యాయమని ప్రశ్నించారు. మేయర్ పదవి పేరుకు బీసీ మహిళకు కేటాయించినా పెత్తనం ఎవరిదని ప్రశ్నించారు. బీసీ మేయర్ వుండగా డిప్యూటీ మేయర్ పెత్తనం చెలాయించడం వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయడం కాదా అని నిలదీశారు.

గంజాయి దందాలో వైసీపీ నేతలకు వాటా

తిరుపతిలో గంజాయి దందా పెరిగిపోయిందని, అందులో కూడా వైసీపీ నేతలకు వాటా వుందని చంద్రబాబు ఆరోపించారు.ఈ పరిస్థితుల నుంచీ తిరుపతిని కాపాడేందుకు సిద్ధమా అంటూ పదేపదే నగరవాసుల్ని ప్రశ్నించి సానుకూల సమాధానాలు రాబట్టారు. తిరుపతిపై పవన్ కళ్యాణ్‌కు సెంటిమెంట్‌తో కూడిన అభిమానముందని, ప్రధాని మోదీ తిరుపతిని పవిత్రంగా భావిస్తారని చెప్పారు. తిరుపతిని పవిత్ర కేంద్రంగా నిలిపే బాధ్యత తాము ముగ్గురూ తీసుకుంటామని హామీ ఇచ్చారు.తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను, తిరుపతి అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును, చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బాబు, పవన్ షో సక్సెస్

తిరుపతి(నేరవిభాగం)/తిరుపతి, మే 7(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం,జనసేన అధినేతలు చంద్రబాబు , పవన్‌కల్యాణ్ తిరుపతిలో మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్డు షో విజయవంతమైంది. శివారు ప్రాంతమైన మంగళం నుంచి నగరం మధ్యలోని నాలుక్కాళ్ల మండపం వరకూ రోడ్లకు ఇరువైపులా జనాలు కిక్కిరిసిపోయారు. భవనాల పైనా గంటల తరబడి వేచిచూశారు. 'జై తెలుగుదేశం, జై జనసేన' నినాదాలతో నగరవీధులు మార్మోగాయి. మధ్యాహ్నం 3.40 గంటలకే మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌కు పవన్‌కల్యాణ్ చేరుకున్నారు.పుంగనూరు పర్యటన ముగించుకుని రాత్రి 7 గంటలకు చంద్రబాబు కూడా అక్కడికి చేరుకున్నారు.అప్పటికే భారీగా అభిమానులు చేరుకోవడంతో లీలామహల్ సర్కిల్ నుంచి ప్రారంభించాల్సిన రోడ్డు షోను మంగళంనుంచే ప్రారంభించారు.లీలామహల్ సర్కిల్ మీదుగా నాలుక్కాళ్ల మండపం వరకూ వాహనంపై నిలబడి అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.భారీ సంఖ్యలో యువకులు ద్విచక్రవాహనాల్లో కాన్వాయ్‌తో పాటే ర్యాలీగా అనుసరించారు.కాగా రోడ్‌షో లీలామహల్ కూడలి వద్దకు చేరుకోగానే విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో కావాలనే కట్ చేశారని రెండు పార్టీల కార్యకర్తలూ వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అశేష జనవాహిని మధ్య జరిగిన రోడ్ షోలో చేపల మార్కెట్, రాజీవ్‌గాంధీ సర్కిల్, నాలుక్కాళ్ల మండపం వద్ద తోపులాటలు చోటుచేసుకున్నాయి.దాదాపు 10మంది కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. జనాన్ని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు.

తిరుపతి

పోటెత్తిన ర్యాలీలు



చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షోకి టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళుతున్న కట్టా జయరామ యాదవ్ తదితరులు



35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో తరలివెళుతున్న ఎన్డీఏ కూటమి శ్రేణులు

టీడీపీలోకి చేరికలు





తిరుపతి టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్ కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకుడు అక్కినపల్లి లక్ష్మయ్యకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, విజయపురం ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిరాజు, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నగరి మాజీ కౌన్సిలర్ గౌరి

డబ్బులిస్తాం.. ఇంటివద్దే ఉండాలన్న వైసీపీ!

పట్టించుకోకుండా రోడ్‌షోకి తరలిన జనం

తిరుపతి అర్బన్, మే 7: లీలామహల్ నుంచి చేపలమార్కెట్ మీదుగా తిలక్ రోడ్డు, నాలుగుకాళ్ల మండపం వరకు సమీప వీధుల్లోని వారికి ఓటుకు రూ.2వేలిస్తాం ఇంటి వద్దే ఉండాలని వైసీపీ నాయకులు కోరినట్లు సమాచారం. అయితే తమకు డబ్బు వద్దు అంటూ ఇంటిల్లిపాదీ రోడ్‌షోకి తరలివచ్చారు. ఈ విషయాలను రోడ్‌షోలో స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 76,748 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,688 మంది తలనీలాలు సమర్పించారు.

వాహన.. మిత్ర ద్రోహం కాదా జగనా?



- సాయం చేసేది ఒక వంతు.. దోచేస్తుంది నాలుగింతలు
- రకరకాల నిబంధనలతో ఏటా లబ్ధిదారుల సంఖ్య కుదింపు
- ఎఫ్‌సీ, గ్రీన్‌ట్యాక్స్ పేరుతో వాహన చోదకులపై భారం

ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో అంతకన్నా ఎక్కువే దోపిడీ చేయడం జగన్ ప్రభుత్వంలో సాధారణమై పోయింది. సంక్షేమం పేరిట అమలుచేస్తున్న ప్రతి పథకం వెనుకా ఇలాంటి మోసమే. ఈ కోవలోకే వస్తుంది వాహనమిత్ర. వాహన చోదకులందరూ ఈపథకం తీరుపై మండిపడుతున్నారు. పైగా ఏటా లబ్ధిదారుల సంఖ్యను రకరకాల సాకులు చూపుతూ కుదించుకుంటూ పోతోందని వీరంతా విమర్శిస్తున్నారు. ఆటోలు, ట్యాక్సీలు, మ్యాక్సీ క్యాబ్‌లు నడుపుతూ బతికే వారికి ఆర్థిక సాయం అందిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకం ఆచరణలో అపహాస్యమవుతోంది. అరకొరగా కొందరిని మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేసి.. ఏడాదికి రూ.10వేలు ఇస్తూ మరో పక్క పన్నులు, పోలీసుల కేసులు, చలనాల రూపంలో నాలుగింతలు తమ నుంచి లాగేస్తున్నారని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. ఆర్థిక సాయం సంగతి పక్కన పెడితే వాహనం తీసుకుని రోడ్డు మీదకు రావాలంటే కేసులు, రోడ్లు తమను బెంబేలెత్తిస్తున్నాయంటున్నారు.

- తిరుపతి(వైద్యం)



అనర్హత వేటు వేశారు



15 ఏళ్లుగా ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఈ క్రమంలో సొంత ఆటో కలిగిన డ్రైవర్లకు ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఇస్తుందంటే.. అప్పు చేసి ఫైనాన్స్‌లో ఆటో కొన్నాను. తర్వాత వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేశాను. కానీ మా ఇంట్లో పింఛను తీసుకునే వారు ఉన్నారని చెప్పి.. నన్ను పథకానికి అనర్హుడిగా చేశారు. పెరిగిన ధరలు, జరిమానాలతో ఇబ్బందులు పడుతూ జీవితం నెట్టుకొస్తున్నాను.

- మురళి, ఆటో డ్రైవర్

ఒక ఏడాదే అందింది



ప్రభుత్వం వాహన మిత్ర పథకం ప్రారంభించిన మొదటి ఏడాది మాత్రమే నాకు సాయం అందింది. ఇంతవరకు అందలేదు. ఎన్నో ఏళ్లుగా సొంత ఆటోనే నడుపుకుంటూ బతుకుతున్నాను. ఎందుకు ఇవ్వడంలేదని అడుగుతుంటే ఎవరూ సమాధానం చెప్పడంలేదు. సాయం అందుతుందో లేదో.. మోనని ఏటా వాహనానికి రూ.10వేలకు పైగా పెట్టి ఎఫ్‌సీ చేయిస్తున్నాను. ఆ అప్పు పెరుగుతుంది తప్ప సాయం అందడంలేదు.

- బాబు, ఆటో డ్రైవర్

● అనర్హత వేటు ఇలా..

వాహన మిత్ర పథకంలో ఏడాదికి ఇచ్చే రూ.10వేలకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. ఆటో డ్రైవర్లను సచివాలయాల చుట్టూ తిప్పుతున్నారు. చివరకు విద్యుత్ బిల్లు 300 యూనిట్ల కంటే ఎక్కువ వాడారనో, గ్రామంలో ఒక మీటరు, పట్టణంలో ఒక మీటరు ఉందనో, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారనో, ఏసీ వాడుతున్నారనో వంటి అభ్యంతరాలు పెట్టి అనర్హత వేటు వేస్తున్నారు.

● దోపిడీ ఇలా..

వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ఏటా వాహనం సామర్థ్యం ధ్రువీకరణ(ఎఫ్‌సీ)కి రూ.2వేలు, ఇన్సూరెన్స్‌కు రూ.8వేలు, గ్రీన్‌ట్యాక్స్ కోసం రూ.400 చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు పెట్రోలు, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వీటితోపాటు ఓవర్ స్పీడ్, అధిక లోడు, రాంగ్ పార్కింగ్, సిగ్నల్‌క్రాస్, యూనిఫాం లేదన్న కారణాలు చూపి కూడా భారీ మొత్తంలో జరిమానాలు వేస్తున్నారని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు.

● టీడీపీ హయాంలో పరిశీలిస్తే.

టీడీపీ ప్రభుత్వ హయాంలో వాహనానికి ఎఫ్‌సీకి రూ.1,700 ఉండగా దానిని వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.6,500కు పెంచింది. అలాగే రూ.3వేలున్న గ్రీన్ ట్యాక్స్‌ను రూ.12వేలకు పెంచారు. ఈ విధంగా ఆటో డ్రైవరు అన్ని పన్నులు, చలానాలతో కలిసి ఏడాదికి రూ.20 వేలకు పైగానే ప్రభుత్వానికి చెల్లిస్తున్నాడు. అలాంటప్పుడు రూ.10వేల పథకం ఇచ్చినా ప్రయోజనమేంటని డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.

ఆరణిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం

పవన్ సమక్షంలో జనసేనలో చేరిన నరసింహులు నాయుడు

44వ వార్డు వైసీపీ కార్పొరేటర్ నారాయణసహా పలువురు జనసేనలో చేరిక





జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన నరసింహులు నాయుడు, నారాయణ తదితరులు



ఎంఆర్‌పల్లె ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న సుగుణమ్మ, పక్కన ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్డీఏ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను భారీ మెజారిటీతో గెలిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ పూర్వ నాయకుడు, మాజీ తహసీల్దార్ ఎం.నరసింహులు నాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతిలో జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు 44వ వార్డు కార్పొరేటర్ నారాయణ, మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్‌లు కూడా జనసేన కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా నరసింహులు నాయుడిని ఉద్దేశించి పవన్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘ నాయకులుగా, మీ అనుభవాన్ని జనసేనపార్టీకి అందించాలని కోరారు. 30వేల మెజారిటీ తగ్గకుండా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిలోనే అది స్పష్టమైందని ఆయన గుర్తుచేశారు. ఎన్డీఏ విజయాన్ని ఆపలేరన్నారు. రెండు వారాలుగా పార్టీ ఆర్గనైజింగ్ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారని, మాజీ ఉద్యోగులు కూడా పెద్దఎత్తున పార్టీపట్ల ఆకర్షితులయ్యేందుకు నాయుడు కృషి చేస్తున్నారని అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కూడా అధినేతకు చెప్పినట్టు తెలిసింది.

ఎంఆర్‌పల్లెని అభివృద్ధి చేస్తాం : ఆరణి

ఎన్డీఏ అభ్యర్థుల గెలుపుతో ఎంఆర్‌పల్లెకి మహర్దశ తీసుకొస్తామని, ఇక్కడున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హామీ ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వస్తే మన ఆస్తులకు భద్రత ఉండదని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పల్లె మాజీ సర్పంచ్ మమత, నాయకులు ముబ్బు దేవనారాయణ రెడ్డి, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, నైనార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆ రెండ్రోజులు మద్యం అమ్మకాలపై నిషేధం

● అక్రమ విక్రయాలపై సమాచారమివ్వండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 11న సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు మద్యం అమ్మకాలపై నిషేధం విధించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ, సెబ్ అధికారులతో సమీక్షించారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా ప్రజలు 91771 19097 నెంబరుకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఈబీ జిల్లా అధికారి రాజేంద్ర, ఎక్సైజ్‌సూపరింటెండెంట్ జానకిరామ్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకూ అనుమతి తప్పనిసరి:

ఎంసీఎంసీ ముందస్తు అనుమతి లేకుండా ఈనెల 13 (పోలింగ్ జరిగే రోజు), 12 (పోలింగ్ ముందు రోజు) తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ప్రచురించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల చివరి దశలో అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే ప్రకటనల వల్ల ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిషన్ గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

మూడ్రోజుల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,832

ఎన్నికల డ్యూటీ ఓటర్లు 16,201, ఎసెన్షియల్ 554... హోమ్ ఓటర్లు 1,077

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆది, సోమ, మంగళవారాల్లో పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు 17,832 పోలయ్యాయి. ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు 16,201 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు 554 మంది, 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, కదల్లేని స్థితిలోని రోగులు, దివ్యాంగుల కేటగిరీలో 1,077 మంది చొప్పున ఓటు వేశారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 4,191 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఎన్నికల విధుల్లో ఉండి.. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయని ఉద్యోగులు, దరఖాస్తు చేసి తిరస్కరణకు గురైన ఉద్యోగులు బుధవారం కూడా దరఖాస్తు చేసి ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. దీంతో బుధవారం కూడా ఈ కేటగిరీకి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశముంది.

పోలైన ఓట్ల వివరాలిలా..

సెగ్మెంట్	ఎన్నికల డ్యూటీ ఓటర్లు	ఎమర్జెన్సీ సర్వీసుల ఓటర్లు	హోమ్ ఓటర్లు
గూడూరు	2297	058	094
సూళ్లూరుపేట	1703	034	175
వెంకటగిరి	1797	051	364
తిరుపతి	3545	099	084
శ్రీకాళహస్తి	2289	085	153
సత్యవేడు	1201	106	062
చంద్రగిరి	3369	121	145
మొత్తం	16201	554	1077

ఇంట్లో లేనివారికి మరో అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), మే 7: జిల్లాలో 1,139మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజైన సోమవారం 955మంది ఓటు హక్కు వినియోగించుకున్న విషయం తెలిసిందే. రెండో రోజైన మంగళవారం ఏడు నియోజకవర్గాల పరిధిలో 122మంది ఓటేశారు. మొత్తం 1,077మంది హోంఓటింగ్ వినియోగించుకున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. అయితే కొంతమంది వృద్ధులు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండటం, ఊరిలో లేనివారికి ఈనెల12వ తేదీ లోపు మరోసారి హోంఓటింగ్ అవకాశం కల్పించనున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మన్నెం శ్రీనివాసులు


తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన తిరుపతికి చెందిన పార్టీ సీనియర్ నేత మన్నెం శ్రీనివాసుల నాయుడిని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభినందించారు. గతంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి తనదైన ముద్రవేసుకున్న ఆయనను పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం తనవంతు కృషిచేస్తానని, అవకాశం కల్పించిన నాయకులకు మన్నెం కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాసులు నాయుడిని అభినందిస్తున్న సుగుణమ్మ







లీలామహల్ సర్కిల్‌లో చంద్రబాబు, పవన్‌కు నీరాజనాలు

బాబు, పవన్ రోడ్ షోలో యువోత్సాహం


ప్రజాగళం
ఎన్డీఏతో వికసిత ఆంధ్ర - వికసిత భారత్
గౌ॥ ప్రధాన మంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారికి
స్వాగతం
సుస్వాగతం
స్థలం : కలికిరి, అన్నమయ్య జిల్లా
తేది : 08-05-2024, సా॥ 3.00 గం॥కు
శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి
రాజంపేట పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి

పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం



కమ్మకండ్రిగలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరికోటపై టీడీపీ జెండా ఎగురవేద్దామని మాజీ ఎంపీపీ, పారిశ్రామిక వేత్త కేశవులు నాయుడు పిలుపునిచ్చారు. కమ్మకండ్రిగలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేశవులు నాయుడు మాట్లాడుతూ గత పదేళ్లలో చంద్రగిరి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, గిరి నాయుడు, అర్జున్ నాయుడు, లంబోదర నాయుడు, వేణుగోపాల్ నాయుడు, ధనంజయ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో టీడీపీ ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న తెలుగు మహిళలు

పాకాల, మే 7: మండలంలోని పాకాల పంచాయతీ గాంధీనగర్, శివాజీనగర్, బాలాజీ కాలనీల్లో మంగళవారం తెలుగు మహిళలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు అందజేస్తూ.. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో డీసీఎం తనిఖీలు

- గుర్తింపుకార్డులు లేని హాకర్ల నుంచి అపరాధ రుసుం వసూలు



రైల్వే స్టేషన్‌లో గుర్తింపు కార్డు లేని హాకర్లను అదుపులోకి తీసుకున్న అధికారులు

తిరుపతి(సెంట్రల్), మే 7: గుంతకల్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు జి.సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో టీటీఐ స్క్వాడ్ బృందాలు మంగళవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పది మందికిపైగా ఆరోగ్యపరమైన ఫిట్‌మెంట్‌తో కూడిన గుర్తింపు కార్డులు లేని హాకర్లను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.రావు, స్టేషన్ సీటీటీఐ ఎం.రత్నానాయక్, స్క్వాడ్ టీటీఐలు పాల్గొన్నారు. ● అంతకు ముందు డీసీఎం సోమశేఖర్ నాయుడు పార్శిల్ కార్యాలయం, రిజర్వేషన్ కార్యాలయం, సాధారణ టికెట్ కౌంటర్లు, ఆహార పదార్థాల దుకాణాలను తనిఖీలు చేశారు. ఎమ్మార్పీ ధరలను పరిశీలించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీసీఐ పి.శ్రీకాంత్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే అభ్యర్థులను గెలిపించడమే ధ్యేయం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రగిరి, మే 7: రాష్ట్రంలో వైసీపీని ఓడించి, ఎన్డీయే అభ్యర్థులను గెలిపించడమే ఎమ్మార్పీఎస్ ధ్యేయమని ఆ సమితి నేత గోపి మాదిగ అన్నారు. మంగళవారం చంద్రగిరి మండలంలోని ఏజీపల్లె, చిన్నరామాపురం, కందులవారిపల్లె, నారావారిపల్లె హరిజనవాడల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. జగన్ పాలనలో దళితులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్డీయే అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జ్ఞానశేఖర్, జగదీష్, కత్తి భాను, జనార్ధన్, శివ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు వేపాకుల అలంకరణ



తిరుపతి(కల్చరల్), మే 7: అమ్మవారి జాతర ముందరి మంగళవారాలలో నిర్వహించే ప్రత్యేక పూజలను మంగళవారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయాన్ని పచ్చని వేపమండలతో అలంకరించారు. కాగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, బంగారు ముఖబింబం, బంగారు వజ్రకిరీటం అలంకరించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, పాలక మండలి అధ్యక్షుడు కట్టా గోపియాదవ్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

14న జాతర చాటింపు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 14వ తేదీన జరగవలసిన జాతర వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు మే 14న జాతర చాటింపుతో మొదలై 21వ తేదీ మంగళవారం జాతరతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి. మే 22న అమ్మవారి విశ్వరూపదర్శనం ఉంటుంది.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠచర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పటిష్ఠచర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విజయవాడనుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల స్లిప్పుల పంపిణీ పూర్తికావస్తోందని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకు ముందు సీఈవో ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి శత వర్ధంతి

తిరుపతి(విద్య), మే 7: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక తారకరామా స్టేడియంలో ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులు అర్పించారు. విద్యార్థి సంఘం మాజీ రాష్ట్ర నాయకులు హరీష్, నాయకులు వెంకటసుబ్బయ్య, మహేష్, నవీన్ తదితరులతోపాటు స్టేడియంలోని వాకర్స్, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

17 నుంచి 19వ తేదీ వరకు

తిరుమలలో పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడురోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు మలయప్పస్వామి గజ వాహనం, రెండవరోజు అశ్వ వాహనం, చివరిరోజు గరుడ వాహనంపై వేంచేపు చేస్తారు. మరోవైపు ఉభయనాంచారులను ప్రత్యేక పల్లకీలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. ఈకార్యక్రమం నేపథ్యంలో 17 నుంచి 19 వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కల్లు విక్రయించే వృద్ధురాలి హత్య?

శ్రీకాళహస్తి, మే 7: కల్లు విక్రయించే జడపల్లి లక్ష్మమ్మ(65)ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఈండ్రపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. బాలాయపల్లె ప్రాంతానికి చెందిన లక్ష్మమ్మ కల్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. నెలరోజుల క్రితం ఈండ్రపల్లిలోని కూతురి ఇంటి వద్దకు వచ్చింది. కల్లుగీత కార్మికుడైన అల్లుడు సేకరించిన కల్లులు విక్రయించేది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మమ్మ తిరిగి చేరుకోలేదు. గ్రామ శివారులోని ముళ్లపొదల్లో కల్లు బిందెపక్కనే లక్ష్మమ్మ శవంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కల్లు బిందె ఖాళీగా ఉండడం, ఆమె విక్రయించిన నగదు లేకపోవడం, ముళ్లపొదల్లో శవం పడి ఉండడాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆధారాలు సేకరించినందుకు కసరత్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు



భాకరాపేట, మే 7: చిన్నగొట్టిగల్లుకు చెందిన వైసీపీ నేత విద్యాసాగర్ రెడ్డి, భాకరాపేటకు చెందిన చిట్టి లక్ష్మీనారాయణ చంద్రగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ మేడసాని పురుషోత్తమ నాయుడు ఆధ్వర్యంలో నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి కలికిరిలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పెనుగాలుల బీభత్సం

- మామిడి రైతులకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



దామలచెరువు వద్ద పెనుగాలులకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, రాలిపోయిన మామిడి కాయలు

పాకాల, మే 7: మండలంలోని దామలచెరువు, మొగరాల, పదిపుట్లబైలు పరిసరాల్లో సోమవారం రాత్రి పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. వందలాది ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కొమ్మలు విరిగిపోయాయి. దీంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బలంగా వీచిన గాలులకు దామలచెరువు పరిసరాల్లో పది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, 25 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం విద్యుత్ శాఖ తిరుపతి రూరల్ ఈఈ ఎస్.వాసురెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, త్వరితగతిన పునరుద్ధరిస్తామని తెలిపారు. మంగళవారం సాయంత్రానికి విద్యుత్ స్తంభాలను అమర్చి విద్యుత్ సరఫరా చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను కూడా త్వరగా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నరేంద్ర, ఏఈ జనార్ధనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంటు

టీడీపీ అధికార ప్రతినిధిగా సురేష్‌రెడ్డి



చంద్రగిరి, మే 7: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికారప్రతినిధిగా చంద్రగిరి మండలం, శానంబట్లకు చెందిన ముడిపల్లి సురేష్‌రెడ్డిని నియమిస్తూ పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ తనను అధికార ప్రతినిధిగా నియమించినందుకు చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, సీఆర్ రాజన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వైసీపీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

చంద్రగిరి కోటపై పసుపు జెండాను ఎగురవేద్దాం



పుదిపట్లలో బడి సుధాయాదవ్, పేరూరులో డాలర్స్ దివాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

తిరుపతి రూరల్, మే 7: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని చంద్రగిరి కోటపై పసుపు జెండాని ఎగురవేద్దామని ఆ పార్టీ యువనేత, రాష్ట్ర ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలంలో పుదిపట్ల పంచాయతీ పరిధిలోని చైతన్యపురం, బ్యాంకు కాలనీల్లో నాని గెలుపుకోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. సుధాయాదవ్ మాట్లాడుతూ.. అధికార వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు, కేసులు పెడుతున్నా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో నానీ వెంట క్యాడర్ మొత్తం నడుస్తున్నారని, ఎన్నికల తర్వాత మనకష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని భరోసా ఇచ్చారు. కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చంద్రగిరిని చంద్రబాబుకి కానుకగా ఇద్దాం

- రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి

చంద్రగిరి నియోజకవర్గంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని అఖండ మెజారిటీతో గెలిపించుకుని చంద్రబాబుకు కానుకగా అందిద్దామని ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలో పేరూరు పంచాయతీ పరిధిలోని జనార్ధన్‌కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ.. టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. పేరూరు పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులు, చిన్నిరెడ్డి, నాగరాజు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, మహేష్ రాయల్, వెంకటేష్, సురేష్‌రాయల్, అనిల్‌రాయల్, వేణుగోపాల్ నాయుడు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నానీ సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

తిరుచానూరు, మే 7: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో మంగళవారం పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురానికి చెందిన పవన్‌కల్యాణ్, ఎంపీటీసీ లావణ్యతో పాటు శేఖర్ రెడ్డి, గజేంద్ర, అమరేష్ తదితరులు పార్టీ కార్యాలయంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపుచూసిందని పవన్ ఆరోపించారు. అలాగే పాడిపేట పంచాయతీ శేషాద్రినగర్‌కు చెందిన పురుషోత్తం, భాగ్యలక్ష్మి టీడీపీలో చేరారు.

భూ యాజమాన్య హక్కు చట్టంతో

ఆస్తులకు రక్షణ కరువు: టీడీపీ



రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, మే 7: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూయాజమాన్య హక్కు చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలతో భూయాజమాన్య హక్కు చట్టం రద్దు కొరకు రెవెన్యూ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, కార్యదర్శి మదనమోహన, వైస్ ఎంపీపీ సునీతా దామోదరం, ఎంపీటీసీ విజయశేఖర, ఆర్వీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, చంద్రశేఖర్, గురుమూర్తి, ఎర్రయ్య నాయుడు, బాలాజీ, వెంకటనాగిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, షబాబ్ బాషా, చోటా సాహెబ్, తులసీ రాయల్, నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో మహిళల జీవితాల్లో వెలుగులు

భాకరాపేట, మే 7: టీడీపీ ప్రభుత్వంతోనే మహిళల జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు పంచాయతీలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిరర్వహించి ప్రజలకు సూపర్ సిక్స్ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజా, సాంబయ్య, మణి, సుబ్రహ్మణ్యం, చెంగల్‌రాయులు తదితరులు పాల్గొన్నారు.

12న కోదండ రామాలయంలో

పుష్పయాగం

తిరుపతి(కల్చరల్), మే 7: తిరుపతి కోదండరామాలయంలో మే 12వ తేదీన పుష్పయాగం నిర్వహించనున్నారు. 11వ తేదీన అంకురార్పణ జరుగుతుంది. 12వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య సీతారామలక్ష్మణులకు పుష్పయాగం జరుగుతుంది. రాత్రి 7 గంటలకు సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు ఆలయ మాడవీధుల్లో విహరిస్తారు. పుష్పయాగంలో పాల్గొనదలచిన గృహస్తులు రూ.1000 టికెట్టుపై ఇద్దరు పాల్గొనవచ్చు.

ఎన్నికల ప్రక్రియలో

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం



● జిల్లా ఎన్నికల పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్ సూచన

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి మీ పాత్ర ఎంతో కీలకమైందని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఉజ్వల్‌కుమార్‌ఘోష్ అన్నారు. మంగళవారం నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో ఎన్నికల విధుల్లో ఉన్న మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా తరగతులు జరిగాయి. అంతకు ముందు పోలింగ్ విధివిధానాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎస్వీయూ ఆడిటోరియంలో చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించిన మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ కైలాస్ వాంఖేడ్.. మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ విధులపై దిశానిర్దేశం చేశారు.

ఎస్వీ గోసంరక్షణకు

రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.10లక్షలు విరాళంగా అందింది. శ్రీకాళహస్తికి చెందిన సుధాకర్, శ్రీకాంత్, శశాంక్‌లు ఈ మొత్తాన్ని డీడీల రూపంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో కార్యాలయం సిబ్బందికి అందజేశారు. సుధాకర్ గతంలో కూడా టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులకు రూ.50 లక్షలను విరాళమిచ్చారు.

రైలు పట్టాలపై అవాంఛనీయ సంఘటనల

నివారణకు చర్యలు

- రైలు మార్గాన్ని పరిశీలించిన సౌత్ సెంట్రల్ డీజీఐ



చందమామపల్లి వద్ద రైలుమార్గాన్ని పరిశీలిస్తున్న రైల్వే జోనల్, డివిజన్ అధికారులు

తిరుపతి(సెంట్రల్)/చంద్రగిరి, మే 7: తిరుపతి - చంద్రగిరి రైల్వే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకొంటామని సౌత్ సెంట్రల్ డిప్యూటీ జనరల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ షాన్ జేబ్ ఖాన్ అన్నారు. మంగళవారం తిరుపతి, చంద్రగిరి రైలు మార్గాన్ని సందర్శించారు. 2023-24వ సంవత్సరములో జరిగిన అవాంఛనీయ సంఘటనల గురించి గుంతకల్ డివిజన్ అధికారులతో చర్చించి, శ్రీనివాస మంగాపురం, చందమామపల్లి, తాటితోపు ప్రాంతాల్లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తిరుపతి ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సురక్ష సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైల్వే కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రైల్వే డైరెక్టర్ జనరల్ ప్రారంభించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, ఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, అధికారులు ఎల్.నరేంద్రరెడ్డి, జి.అప్పారావు, డిప్యూటీ సీఈ నరేంద్రరెడ్డి, డి.రాజాబాబు, ఉన్నం అక్కిరెడ్డి, చంద్రశేఖర్, కె.బేనయ్య, బీడీవీఎస్ సుబ్రహ్మణ్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో న్యాయమూర్తులు



ఆలయం ముందు జస్టిస్ సురేంద్ర, జస్టిస్ శేషసాయి

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయితో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బాలాజి



తిరుపతి(క్రీడలు), మే 7: చెస్ అసోసియేషన్ నూతన జిల్లా అధ్యక్షుడిగా బాలాజి ప్రసాద్‌చౌదరి నియమితులయ్యారు. మంగళవారం జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి, జిల్లా సంఘం కార్యదర్శి శ్రీనివాస సూరి, తదితరులు నూతన అధ్యక్షుడిని అభినందించారు.

శ్వాసకోశ వ్యాధులకు అందుబాటులో అధునాతన వైద్య పద్ధతులు

● రుయాలో పల్మనరీ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం



పల్మనరీ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రేమానంద్

తిరుపతి(వైద్యం), మే 7: శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటి వ్యాధులకు ప్రస్తుత రోజుల్లో అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని సీనియర్ పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రేమానంద్, డాక్టర్ నరసింహన్ పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని అల్యూమిని ఆడిటోరియంలో మంగళవారం ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు అధ్యక్షతన అస్తమా దినోత్సవం సందర్భంగా పల్మనరీ మెడిసిన్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 200 మందికి పైగా వైద్య అధ్యాపకులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రుయాస్పత్రిలోని పల్మనాజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్మనరీ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రంలో శ్వాసకోశ వ్యాధులతో బాధపడే రోగులకు శ్వాస సామర్థ్యాన్ని పెంచే వ్యాయామ ప్రక్రియలపై శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెట్ డాక్టర్ రవిప్రభు, పల్మనరీ వైద్య నిపుణులు నీతి చంద్ర, అజయ్‌కుమార్, అనుపమ, భరత్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 26మందికి నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ తరగతులకు ఎలాంటి కారణం చూపకుండా గైర్హాజరైన పీవో, ఏపీవోలు 26మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారినుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోతే ఎన్నికల కోడ్ ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ప్రధాని మోదీ రాక

తిరుపతి(కలెక్టరేట్), మే 7: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి హైదరాబాదు నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.55గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకోనున్నారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 3.40గంటలకు అన్నమయ్య జిల్లా కలికిరికి వెళతారు. ఎన్నికల బహిరంగ సభలో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో 5.20గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్లనున్నారు.

అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్





గూడూరు మసీదులో ప్రార్థన చేస్తున్న వరప్రసాద్ - తిరుపతిలో జరిగిన ప్రచారంలో చంద్రబాబు, పవన్‌తో వరప్రసాద్

గూడూరు అర్బన్, మే 7: ప్రజలకు సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని మసీదులో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రార్థనలు నిర్వహించారు. పలువురు బీజేపీలో చేరడంతో వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మసీదు వద్ద దుకాణంలో టీ తాగుతూ, అందరినీ సరదాగా పలకరిస్తూ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎంపీగా గెలిస్తే అమృతపథకంతో సమానంగా కేంద్రం నుంచి మున్సిపాలిటీకి నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధిపనులు చేపడుతామన్నారు. అశోక్ నగర్ సమీపంలో మరో రైల్వే అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. వందేభారత్ రైలు గూడూరులో స్టాపింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసప్ప, మన్నెం శీనయ్య, వినీష్, రమణయ్య, సుమన్, దిలీప్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌ని గెలిపించి మోదీకి కానుకగా ఇద్దాం

తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి): సర్వేలన్నీ ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉన్నాయని, ధర్మమే గెలిచి తీరుందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను 2009లో తానే రాజకీయాల్లోకి ఆహ్వానించానని చెప్పారు. కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను గెలిపించి నరేంద్ర మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. చంద్రబాబుకి తిరుపతిలో వీధివీధి తెలుసని, ఇక్కడే పుట్టి, పెరిగి ఎస్వీయూ విద్యార్థి నాయకుడిగా ఎదిగారన్నారు. అలిపిరి బాంబు ఘటనలో దుమ్ముదులుపుకుని రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న చంద్రబాబు మద్దతుతో ఆరణి శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. పులివర్తి నాని, సుగుణమ్మ, సీఆర్ రాజన్, నరసింహ యాదవ్, డాక్టర్ హరిప్రసాద్, భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో కాలుజారిపడి విద్యార్థి మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, మే 7: చెరువులో కాలుజారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలంలోని చిన్నరామాపురం హరిజనవాడకు చెందిన ప్రవీణ్‌కుమార్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తండ్రి మృతి చెందడంతో తల్లి సునీత జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. దాంతో చిన్నరామాపురంలోని తన అక్క, బావ ప్రవీణ్ ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి మూలపల్లె చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయాడు. స్నేహితులు గాలించినా ప్రయోజనం లేకపోయింది. గజ ఈతగాళ్లను రప్పించి గాలిస్తే ప్రవీణ్ మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రుతిమించుతున్న 'వైసీపీ' ఆగడాలు

- మాకే ఓటేయాలంటూ బెదిరిస్తున్నారని చిరు వ్యాపారుల ఆవేదన

తిరుపతి(నేరవిభాగం), మే 7: నగరంలో వైసీపీ శ్రేణుల ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయి. చివరకు చిరువ్యాపారులూ వదలడం లేదు. తమకే ఓటేయాలని బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'వచ్చేది మా ప్రభుత్వమే.. మా పార్టీకి ఓటేయకుంటే మీ సంగతి చూస్తాం' అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారని చిరువ్యాపారులు వణికిపోతున్నారు. దీనిపై ఎన్నికల అధికారిని కలసి తమ గోడు విన్నవించుకోవాలని భావిస్తున్నట్లు వారు తెలిపారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, మే 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణ చేసి తిరిగి ఆలయంలో కొలువుదీర్చారు.

కల్లు విక్రయించే వృద్ధురాలి హత్య?



లక్ష్మమ్మ మృతదేహం

శ్రీకాళహస్తి, మే 7: కల్లు విక్రయించే జడపల్లి లక్ష్మమ్మ(65)ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఈంద్రపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. బాలాయపల్లె ప్రాంతానికి చెందిన లక్ష్మమ్మ కల్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. నెలరోజుల క్రితం ఈంద్రపల్లిలోని కూతురి ఇంటి వద్దకు వచ్చింది. కల్లుగీత కార్మికుడైన అల్లుడు సేకరించిన కల్లులు విక్రయించేది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మమ్మ తిరిగి చేరుకోలేదు. గ్రామ శివారులోని ముళ్లపొదల్లో కల్లు బిందెపక్కనే లక్ష్మమ్మ శవంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కల్లు బిందె ఖాళీగా ఉండడం, ఆమె విక్రయించిన నగదు లేకపోవడం, ముళ్లపొదల్లో శవం పడి ఉండడాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆధారాలు సేకరించినందుకు కసరత్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

శ్రీకాళహస్తి, మే 7: శ్రీకాళహస్తి మండలం భీమవరం గ్రామంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణతో రాజకీయ దుమారం చోటుచేసుకుంది. భీమవరం గ్రామానికి చెందిన బుజ్జమ్మది టీడీపీ సానుభూతిపరుల కుటుంబం. అదే గ్రామానికి చెందిన సంధ్యది వైసీపీ కార్యకర్త కుటుంబం. ఇద్దరి మధ్య వ్యక్తిగత గొడవలు ఉండడంతో మాటామాటా పెరిగింది. ఇరువురు పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో సంధ్య గాయపడింది. దీంతో ఆమె భర్త చిన్నమ నాయుడు, అదే గ్రామానికి చెందిన వలంటీర్ శివ మరికొందరితో కలిసి బుజ్జమ్మ ఇంటిపై దాడి చేశారు. భయాందోళనతో ఆమె తలుపులు వేసుకొని ఇంట్లో కూలిపోయింది. వైసీపీ వర్గీయులు తలుపులు పగలగొట్టి హాల్లోకి ప్రవేశించారు. బుజ్జమ్మ మళ్లీ బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలదాచుకుంది. సమాచారం తెలుసుకున్న బుజ్జమ్మ కుమారుడు శివ ఇంటికి చేరుకుని పరిస్థితిని గమనించాడు. సచివాలయ ఉద్యోగి అయిన తన అన్న వైసీపీకి అనుకూలంగా వ్యవహరించలేదని ఉద్దేశపూర్వకంగా ఆ పార్టీ నాయకులు, వలంటీర్ శివతో కలిసి తన ఇంటిపై విధ్వంసం చేశారని వాపోయాడు. ఇరువర్గాలుపోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుతోనే సకల జనుల సంక్షేమం



హనుమంతాపురం సభలో మాట్లాడుతున్న మాధవులనాయుడు

పిచ్చాటూరు, మే 7: చంద్రబాబుతోనే సకల జనుల సంక్షేమం సాధ్యపడుతుందని ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులనాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ఎస్‌బీ పేట, హనుమంతాపురం, బంగాళ, పులిగుంద్రం, గోవర్ధనగిరి, అడవి శంకరాపురం, అప్పలరాజు కండ్రిగ, శివగిరి, సిద్ధిరాజు కండ్రిగ, చెంచురాజు కండ్రిగ గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్టు అమలైతే రైతుల భూములు రాబందుల చేతికి వెళ్తాయని, పాపాల పెద్దిరెడ్డి లాంటి భూ దోపిడీదారులు ప్రజలపై విలయ తాండవం చేస్తారని మండిపడ్డారు. కుట్ర రాజకీయాలు వద్దు ప్రజాసేవ ముద్దుగా ముందుకెళ్దామని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, మనోహర్, పద్దురాజు, జయచంద్ర నాయుడు, రామచంద్రరాజు, రవి, వెంకటరత్నం నాయుడు, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత మేల్కొల్పుతోనే శ్రీకాళహస్తికి పూర్వ వైభవం

శ్రీకాళహస్తి, మే 7: యువత మేలుకొలుపుతోనే శ్రీకాళహస్తికి పూర్వ వైభవం సాధ్యమని నియోజకవర్గ ఐటీడీపీ జనరల్ సెక్రటరీ వంశీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర దిశగా నడిపించే మహోన్నత దార్శనికనేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలసిన అవసరం ఉందన్నారు. యువత జాబ్ క్యాలెండర్ వస్తుందన్న ఆశతో జగన్‌కు ఓటు వేస్తే సాక్షి క్యాలెండర్ వచ్చిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయన తనయుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు యువత నడుం కట్టాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని యువతకు ఉపాధి అవకాశాలు ఉమ్మడి ప్రభుత్వంతో ఏర్పాటు అవుతాయని చెప్పారు.

హైస్కూల్ ప్రహరీ చుట్టూ వైసీపీ జెండాలు

ఏర్పేడు, మే 7: ఏర్పేడు మండలం మునగపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల చుట్టూ వైసీపీ జెండాలను హారాలుగా ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ ఉండగా పాఠశాల ప్రహరీ చుట్టూ జెండాలను తగిలించడం పట్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాటిని తొలగించాలని కోరుతున్నారు.



పాఠశాల ప్రహరీకి ఏర్పాటు చేసిన వైసీపీ జెండాలు

శ్రీకాళహస్తి
సత్యవేడు

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మే 7: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, మే 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుదీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులకు వెన్నుదన్నుగా నిలుస్తాం: సుధీర్ రెడ్డి



బొజ్జల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

శ్రీకాళహస్తి, మే 7: శాంతి భద్రతల పరిరక్షణతో శ్రీకాళహస్తిలో వ్యాపారులకు వెన్నుదన్నుగా నిలుస్తామని బొజ్జల కుటుంబ సభ్యులు భరోసా ఇచ్చారు. శ్రీకాళహస్తి పట్టణం బజారు వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషిత రెడ్డి, తల్లి బృందమ్మ అతిథులుగా హాజరయ్యారు. వారిని పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్యులు, వ్యాపారులు ఘనంగా సత్కరించారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తిని ప్రశాంతతకు మారుపేరుగా నిలపడంతో పాటు, శరవేగంగా అభివృద్ధి పథంలో నడపడంతో తన తండ్రి గోపాలకృష్ణారెడ్డిని ప్రజలు ఐదుసార్లు ఆదరించారని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచక శక్తులు చెలరేగిపోవడంతో ప్రజలకు కంటిమీద కొనుకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే శ్రీకాళహస్తిలో రౌడీయిజం అంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి రిషితా రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కరీముల్లా షఫీ, రసూల్ షేక్ అలీ, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పంచాయతీ పరిధిలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. సుధీర్‌రెడ్డికి గ్రామాల్లో హారతులు పలికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి విడుదల చేసి మేనిఫెస్టోలో రూ.4వేల పింఛను గురించి ప్రజల్లో విశేష స్పందన వస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసి అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయి కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రేణిగుంట అజంతా మెస్‌లో
స్థానికులతో కలిసి భోజనం చేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి

తిరుపతి బీజేపీ అభ్యర్థి వరప్రసాద్





గూడూరు మసీదులో ప్రార్థన చేస్తున్న వరప్రసాద్ - తిరుపతిలో జరిగిన ప్రచారంలో చంద్రబాబు, పవన్‌తో వరప్రసాద్

గూడూరు అర్బన్, తిరుపతి, మే 7: ప్రజలకు సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని మసీదులో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రార్థనలు నిర్వహించారు. పలువురు బీజేపీలో చేరడంతో వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మసీదు వద్ద దుకాణంలో టీ తాగుతూ, అందరినీ సరదాగా పలకరిస్తూ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎంపీగా గెలిస్తే అమృతపథకంతో సమానంగా కేంద్రం నుంచి మున్సిపాలిటీకి నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధిపనులు చేపడుతామన్నారు. అశోక్ నగర్ సమీపంలో మరో రైల్వే అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. వందేభారత్ రైలు గూడూరులో స్టాపింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసప్ప, మన్నెం శీనయ్య, వినీష్, రమణయ్య, సుమన్, దిలీప్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌ని గెలిపించి మోదీకి కానుకగా ఇద్దాం

తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి): సర్వేలన్నీ ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉన్నాయని, ధర్మమే గెలిచి తీరుందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను 2009లో తానే రాజకీయాల్లోకి ఆహ్వానించానని చెప్పారు. కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను గెలిపించి నరేంద్ర మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. చంద్రబాబుకి తిరుపతిలో వీధివీధి తెలుసని, ఇక్కడే పుట్టి, పెరిగి ఎస్వీయూ విద్యార్థి నాయకుడిగా ఎదిగారన్నారు. అలిపిరి బాంబు ఘటనలో దుమ్ముదులుపుకుని రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న చంద్రబాబు మద్దతుతో ఆరణి శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. పులివర్తి నాని, సుగుణమ్మ, సీఆర్ రాజన్, నరసింహ యాదవ్, డాక్టర్ హరిప్రసాద్, భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శ్రీకాళహస్తి, మే 7: రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పానగల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ మునిరత్నం వర్ధంతి పురస్కరించుకుని రాస్ కార్యాలయంలో నివాళులర్పించారు. అనంతరం టాటా ట్రస్టు సహకారంతో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పొదుపు సంఘాల మహిళలకు వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ మహమ్మారి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకయ్య బాబు, రెడ్డి కుమారి పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

పిచ్చాటూరు, మే 7: మండలంలోని పిచ్చాటూరు, ఏకే బేడు, కారూరు, నీరువాయి గ్రామాల్లో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అండగా ఉంటారని చెప్పారు.

పంచాయతీ ఒప్పంద కార్మికుడి తొలగింపు

రేణిగుంట, మే 7: వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన పంచాయతీ ఒప్పంద కార్మికుడిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో విష్ణుచిరంజీవి మంగళవారం తెలిపారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మే 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్వీ గోసంరక్షణకు రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.10లక్షలు విరాళంగా అందింది. శ్రీకాళహస్తికి చెందిన సుధాకర్, శ్రీకాంత్, శశాంక్ ఈ మొత్తాన్ని డీడీ రూపంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. సుధాకర్ గతంలో కూడా టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులకు రూ.50 లక్షలను విరాళమిచ్చారు.

విశ్వతమాల పాఠశాలలో తనిఖీలు

ఏర్పేడు, మే 7: మండలంలోని విక్రుతమాల ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనులను జిల్లా సమగ్ర శిక్ష అధికారి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు తగు సూచనలు ఇచ్చారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రచారం ముసుగులో చీరల పంపిణీ

రేణిగుంట, మే 7: రేణిగుంట పట్టణంలో వైసీపీ నేతలు ప్రచారం ముసుగులో వలంటీర్ల సహకారంతో మంగళవారం చీరలు పంపిణీ చేశారని సమాచారం. రోజు ఉదయం, సాయంత్రం వార్డుల్లో వైసీపీ ప్రచారం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చీరలను పంపిణీ చేసినట్లు తెలిసింది.

టీడీపీలో చేరిక

ఏర్పేడు, మే 7: ఏర్పేడు మండలంలోని మేర్లపాక మాజీ వైస్ సర్పంచు చింత వెంకటరమణ యాదవ్ మంగళవారం టీడీపీలో చేరారు. ఆయనకు బొజ్జల సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు స్వాగతం





రేణిగుంట, మే 7: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. పుంగనూరులో సభ ముగించుకున్న చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్‌లో విమానాశ్రయం చేరుకున్నారు. వీరికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి



సత్యవేడులో మాట్లాడుతున్న అశ్వత్ నారాయణ

సత్యవేడు, మే 7: రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలాన్ని గెలిపించాలని కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం అశ్వత్ నారాయణ కోరారు. మంగళవారం ఆయన సత్యవేడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధిలో పదేళ్లలో ప్రపంచంలో అగ్రదేశాల సరసన నిలించిదన్నారు. మరోసారి బీజేపీకి ఓటేసి దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ బీజేపీ నేత మునిసుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షుడు మునిప్రతాప్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, నాయకులు వాసు, శ్రీకాంత్ కుమార్, మురళీ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నాయకుడు అశ్వత్ నారాయణ వరదయ్యపాళెం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం, పురుషోత్తం, సిద్ధులయ్య, సుబ్బరత్నమ్మ, సూర్యనారాయణ, రాంబాబు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

నాగలాపురం, మే 7: మండల పరిధిలోని సురుటుపల్లె సచివాలయ పరిధిలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీవో బాబును కలిసి తమ రాజీనామా పత్రాలు అందించారు.

పుత్తూరు వార్తలు

పుత్తూరు అభివృద్ధిపై ముద్దుకృష్ణమది చెరగని ముద్ర



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

పుత్తూరు అర్బన్, మే 7: పుత్తూరు అభివృద్ధి సాధించడంలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడిది చెరగని ముద్రని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇనుకొండ సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముద్దుకృష్ణమకు అత్యంత సన్నిహితంగా మెలిగిన అనుచరుడిగా పుత్తూరు అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 50కు పెంచడం, ఆర్టీసీ బస్టాండ్, తాగునీటి సమస్య తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించే ఫ్లై ఓవర్, టీబీ రోడ్డులో అండర్ బ్రిడ్జి, మౌలిక సౌకర్యాల మెరుగునకు పుత్తూరును మున్సిపాలిటీ చేయడం, ఫైర్ స్టేషన్ ఇలా పుత్తూరు అభివృద్ధికి ముద్దుకృష్ణమనాయుడు ఎనలేని కృషి చేశారని వివరించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజా ఏమి చేసిందని నిలదీశారు. తిరిగి ప్రశాంతమైన పుత్తూరు కావాలంటే గాలి భానుప్రకాష్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. సమావేశంలో గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, డీజీ ధనపాల్, సింగంశెట్టి సుబ్బరామయ్య పాల్గొన్నారు.



తిరుపతిలో మంగళవారం రాత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, విజయపురం ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిరాజు, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, కొప్పేడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, నగరి మాజీ కౌన్సిలర్ గౌరి

వైసీపీలో అలజడి

- టీడీపీలోకి రెడ్డివారి చక్రపాణిరెడ్డి
- అదే బాటలో వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి
- విజయపురం కీలక నాయకుడు లక్ష్మీపతిరాజు
- వీరితో పాటు ఎంటీసీలు, సర్పంచులు కూడా

పుత్తూరు అర్బన్, మే 7: నగరి వైసీపీలో తీవ్ర అలజడి చెలరేగింది. మంగళవారం సాయంత్రం తిరుపతి ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీ కీలక నాయకులు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నింద్రకు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురం కీలక నాయకుడు, ఎంపీటీసీ లక్ష్మీపతిరాజుకు చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఎంపీటీసీలు, సర్పంచులు కూడా

నగరికి చెందిన మాజీ కౌన్సిలర్ గౌరి, నింద్ర మండలానికి చెందిన కొప్పేడు ఎంపీటీసీ రెడ్డివారి భాస్కర రెడ్డి, చవరంబాకం ఎంపీటీసీ కె.విజయ, చవరంబాకం సర్పంచు మనోహర నాయుడు, కైపాకం సర్పంచు ప్రభాకర్, జీఎన్ కండ్రిగ సర్పంచ్ జయచంద్రారెడ్డి, నెట్టేరి సర్పంచ్ మురళి, శ్రీరాంపురం సర్పంచు గార్లపాటి జయమ్మ, కొప్పేడు సర్పంచు సంపూర్ణ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగభూషణ రాజు, తులసిరెడ్డి మంగళవారం నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు వైసీపీ కీలక నాయకుడు, నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం కుమారుడు పీవీ సంపత్‌కుమార్ కూడా టీడీపీలో చేరడం నియోజకవర్గంలో సంచలనం కలిగించింది.

రోజా వైఖరి నచ్చకనే...

గత రెండు ఎన్నికల్లోనూ వైసీపీ గెలుపులో కీలకంగా వ్యవహరించిన నాయకులు ఒక్కొక్కరు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ కేడర్‌ను గందరగోళానికి గురిచేస్తోంది. గత నెలలో చంద్రబాబు నాయుడు సత్యవేడు పర్యటన సందర్భంగా పుత్తూరుకు చెందిన వైసీపీ కీలక నాయకుడు డీఎన్ ఏలుమలై మొదలియార్ టీడీపీలో చేరారు. మంగళవారం మిగిలిన మండలాల కీలక నాయకులు టీడీపీలో చేరిపోవడం నియోజకవర్గంలో వైసీపీకి గుబులు పుట్టిస్తోంది. ఫిబ్రవరి నుంచి వైసీపీలో కీలక నాయకులు పలుమార్లు తిరుపతిలో మీడియా సమావేశాలు నిర్వహించి రోజాకు అభ్యర్థిత్వం ఇవ్వవద్దని వైసీపీ అధిష్టానానికి మొరపెట్టుకున్నారు. గత ఐదేళ్ల నుంచి తమను అన్ని రకాలుగా వేధిస్తోందని వారు వివరించారు. దీంతో పాటు ఆమెపై అవినీతి ఆరోపణలు గుప్పించారు. అసమ్మతి నాయకుల అభ్యర్థనలను పెడచెవిన పెడుతూ వైసీపీ అధిష్టానం రోజాకే టికెట్ ఇవ్వడంతో.... ఆమె వైఖరితో విసిగిపోయే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు వారం రోజుల క్రితం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ అవకాశాన్ని టీడీపీ చక్కగా సద్వినియోగం చేసుకుంది. వైసీపీలో అసంతృప్తులను తనవైపు తిప్పుకోవడంలో సక్సెస్ సాధించింది. వరుస చేరికలతో టీడీపీ నూతనోత్సాహంతో పోలింగ్‌కు సిద్ధమవుతుండగా, ఒక్కొక్క కీలక నాయకులు పార్టీని వీడుతుండడంతో వైసీపీ నేలచూపులు చూస్తోందనే చర్చ జరుగుతోంది.

● మీకు తెలుసా — పోలీసైనా నో ఎంట్రీ


పోలింగ్ రోజున పోలీసులకు కూడా పోలింగ్ బూత్‌లోకి అడుగు పెట్టేందుకు అనుమతి ఉండదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే తప్ప వారు లోపలికి వెళ్లకూడదు. అదీ ప్రిసైడింగ్ అధికారి ఆదేశాల మేరకే వెళ్లాలి. పోలింగ్ జరుగుతున్నంత సేపు వారు బయట మాత్రమే విధులు నిర్వర్తించాలి. పోటీ చేసే అభ్యర్థికి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నా... ఆయన వెంట ఉండే రక్షణ సిబ్బంది కూడా లోపలకు వెళ్లరాదు. అభ్యర్థితో పాటు మఫ్టీలో ఉన్న ఒక్కకేపే అనుమతి ఉంటుంది.

\- చిత్తూరు కలెక్టరేట్

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

జగన్ మెప్పుకోసం విపక్షాల మీద విరుచుకుపడే ఆర్కే రోజా నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఈ ఐదేళ్లలో ఓ వీసమెత్తు మంచి చేయలేదు. నోరు తప్ప చేతలు శూన్యం. నియోజకవర్గంలోని వనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగడానికి ఆమె అండగా నిలబడ్డారనే ఆరోపణలున్నాయి. రేషను బియ్యం, ఇసుక.. చివరికి మట్టినీ మంత్రిగారి అనుచరులు వదల్లేదు. ఆమె ఇద్దరు సోదరులు వసూల్ రాజాలుగా జనం నోళ్లలో నానిపోయారు. ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా ఉండీ నియోజకవర్గానికి ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయిన రోజా పర్యాటక మంత్రిగానూ చేసింది ఏమీ లేదు. ఎన్నికల వేళ నగరి నియోజకవర్గ ప్రజలు రోజా చెప్పిన మాటలనూ, చేతలనూ గుర్తుచేసుకుంటున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో నగరిని ఉంచిన రోజాకు మళ్లీ ఓట్లు ఎందుకు వేయాలని చర్చించుకుంటున్నారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నోరు తప్ప.. చేతలేవి రోజమ్మా?

ఐదేళ్ల అరాచకాలు, అవినీతి సామ్రాజ్యంపై జనాగ్రహం

నగరి ప్రజల చెవిలో రోజా పూలు



హామీ: మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల కరెంటు ఉచితంగా అందిస్తాను.
అమలు: ఉచితంగా కరెంటు ఇవ్వకపోగా వెయ్యి రూపాయల లోపు వచ్చే కరెంటు బిల్లు జగన్ ప్రభుత్వంలో రూ.3000 వస్తోంది.

హామీ: నగరిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తా.
అమలు: ఈ హామీని గాలి కొదిలేశారు.

హామీ: గాలేరు-నగరి పూర్తి చేసి, నియోజకవర్గంలో తాగు, సాగు నీటి కొరత లేకుండా చేస్తాను. **అమలు:** ఈ ఐదేళ్లలో ఒక తట్ట మట్టి కూడా ఎత్తలేదు. పైగా టీడీపీ హయాంలో పనులు జరిగి మిగిలిపోయిన మట్టి, ఇసుక, గ్రావెల్ వంటివి వైసీపీ వాళ్లు దోచుకెళ్లారు.

హామీ: గాజులవండ్యం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాను
అమలు: టీడీపీ హయాంలో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేసిన రోజా, ప్రభుత్వం దాన్ని లిక్విడేషన్‌కు ఇచ్చేసినా నోరు తెరవలేదు.

హామీ: వడమాలపేట, విజయపురం మండలాల్లో పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తా.
అమలు: ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా, మంత్రిగా ఉన్నా.. నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకునిరాలేక పోయారు.

హామీ: పుత్తూరులోని 50 పడకల ఆసుపత్రిని వంద పడకలకు అభివృద్ధి చేస్తాను.
అమలు: అటు వంటి ప్రతిపాదన కూడా ప్రభుత్వానికి పంపించలేదు.

హామీ: నింద్ర షుగర్ (ప్రైవేటు) ఫ్యాక్టరీని వేలం వేసి అయినా రూ.36 కోట్ల రైతుల బకాయిలు ఇప్పిస్తా.
అమలు: బకాయిల గురించి పట్టించుకోనేలేదు.

నెలనెలా వాటాలు

● తమిళనాడుకు సరిహద్దున ఉన్న నగరి నియోజకవర్గంలో మట్టి కూడా బంగారంగా మారింది. వైసీపీవారు తాత్కాలిక లైసెన్సులతోనే నెలల తరబడి మట్టిని తమిళనాడుకు తరలించేసి కోట్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి రోజాకు నెలవారీ వాటాలు అందేవని విపక్షాలు ఆరోపిస్తుంటాయి.

● కుశస్థలి నదిలో ఇసుకను దోచేశారు. ఆంధ్రా ఇసుకకు తమిళనాడులో డిమాండ్ ఉండడంతో వందల కోట్లు వెనకేసుకున్నారు. ఇక్కడా రోజాకు వాటాలు దక్కేవని ఆరోపణలు ఉన్నాయి.

● రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి పాలిష్ చేసి అమ్మేసే పనులు అధికారపార్టీ వారు జోరుగా చేసేవారు. ఇందులోనూ రోజాకు నెల మామూళ్లు వెళ్లేవని చెబుతుంటారు.

● నియోజకవర్గంలోని రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెల మామూళ్లు సమర్పించుకోవాలని విమర్శలున్నాయి. మంత్రికి భయపడి గతంలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు బదిలీ చేసుకుని వెళ్లిపోయారంటారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయాల నుంచి కూడా వీరి ట్రస్టుకు విరాళాల రూపంలో ముడుపులు సమర్పించుకోవాల్సిందేనని చెబుతారు.

వసూల్ రాజాలు.. ఆ సోదరులు

ఎమ్మెల్యేకు ఇద్దరు సోదరులున్నారు. ఆయా మామూళ్ల వసూళ్లలో ఈ ఇద్దరిదే కీలకపాత్ర అని అంతా చెబుతుంటారు.

● ఓ మండలంలో బినామీ పేర్లతో గ్రావెల్ క్వారీలను వీరు నడిపిస్తున్నారు. చివరికి ఇటుక బట్టీలకు మట్టి తోలుకునే వారు కూడా ఎమ్మెల్యే సోదరులకు ముడుపులు ఇవ్వాల్సిందేనంటారు. వసూళ్ల కోసం ప్రత్యేక ఏజెంట్లను నియమించుకున్నారని చెబుతారు.

● ఈ ప్రాంతంలో తహసీల్దార్‌గా పనిచేయాలంటే కచ్చితంగా ఎమ్మెల్యే సోదరులను సంతృప్తి పరచాల్సిందే అని ప్రచారంలో ఉంది. సీఐలు సహా ఇతర అధికారులు ఎవరైనా ఇక్కడ పనిచేయాలంటే స్థాయిని బట్టి రేటు ఇచ్చుకోవాల్సిందేనని చెబుతారు. ఏ మాత్రం మాట వినకున్నా జిల్లా అధికారులకు చెప్పి వెంటనే బదిలీ చేయించేస్తారని ప్రచారం. ● మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తానని ఆశ చూపి రోజా సోదరుడు రూ.50 లక్షలు తీసుకున్నట్టు పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆధారాలతో సహా ఆరోపణలు చేశారు.

● పుత్తూరులోని కార్వేటినగరం సర్కిల్ వద్దనున్న కోనేరు పునరుద్ధరణ పేరుతో దాన్ని చిన్నదిగా చేసేసి చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఒక్కో షాపు వద్ద రూ.8 లక్షలు చొప్పున 32 షాపుల వద్ద నుంచి వసూలు చేశారని రోజా అనుచరులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. వసూలు చేసిన వైసీపీ నేత రూ.25 లక్షలు ఆమె ట్రస్టుకు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఈ నిర్మాణం ఆగిపోయింది.

భూంధాం!

● విజయపురం మండలంలో 300 ఎకరాల ప్రభుత్వ భూములను తన అనుచరుల పేర్లతో రోజా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారనే అంశం వివాదం అయ్యింది. విచారించిన జిల్లా అధికారులు ఆ భూముల్ని వెనక్కి తీసుకుని నలుగురు కింద స్థాయి రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్ చేశారు.

● వడమాలపేట అంజరమ్మకనుమ వద్ద వినోబాబావే భూదానోద్యమానికి వచ్చిన 12 ఎకరాల భూమిని బినామీ పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వెనుక రోజా హస్తం ఉందనే ప్రచారం జరిగింది.

● వడమాలపేట మండలం పాదిరేడులో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూమి సేకరించారు. అంతకుముందే అక్కడి కాలువ, రాస్తా, డీకేటీ భూములకు పట్టాలు చేయించి సుమారు రూ.12 కోట్ల పరిహారం పొందినట్లు సమాచారం.

దబాయింపులు

● కంకర క్రషర్ల మీద అధికారులతో దాడులు చేయించి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు కూడా ఆరోపణలున్నాయి. దీంతో చాలామంది క్రషర్లను మూసేశారు. టీడీపీకి చెందిన ఓ వ్యక్తి క్రషర్‌కు రూ.కోట్లలో జరిమానా విధించి.. రూ.2 కోట్లు డిమాండ్ చేశారని, దీంతో ఆయన గుండెపోటుతో మరణించారని ఆరోపణలున్నాయి.

● నియోజకవర్గంలో ఎక్కడ వెంచర్లు వేసినా రోజాకు నాలుగు ప్లాట్లు, నగదు ఇవ్వాల్సిందేనని ఆరోపణలున్నాయి. లేదంటే బెదిరింపులు వెళ్లాయి. వెంచర్లకు అనుమతులు రావు.

ప్రజలూ ఒకసారి ఆలోచించండి

● మేలు చేసే వారికి ఓటేయండంటూ భువనేశ్వరి పిలుపు



కుప్పం/శాంతిపురం, మే 7: తమకు మేలు చేసేది ఎవరు? కీడు చేసేది ఎవరు? అనేది ప్రజలు ఆలోచించి ఓటేయాలని నారా భువనేశ్వరి కోరారు. ఈ అయిదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రం.. ప్రజల విషయంలో చేయని అన్యాయం, అరాచకం లేదన్నారు. దీనికి విరుద్ధంగా చంద్రబాబు నిరంతరం ప్రజలకోసమే పనిచేస్తారని గుర్తుచేశారు. 75 ఏళ్ల వయసులోనూ ఎంతో కష్టపడుతున్నారని, తనను నమ్మిన ప్రజలకోసం ఈ కష్టాన్ని ఇష్టంగా భరిస్తున్నారన్నారు. శాంతిపురం మండలం బెల్లకోగిల ఎస్సీ కాలనీ, బెల్లకోగిల, చంద్రగిరి క్రాస్, రేగడదిన్నేపల్లె, సోగడబల్ల, బోయనపల్లెల్లో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్‌షోలలో ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో మ్యానిఫెస్టో ప్రకటించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఎవరి భూమిపై వారికి హక్కులు ఉండవన్నారు. వైసీపీ నేతల చేతికి ఆ భూములు చేరిపోతాయన్నారు. 'ఇది అరాచకానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఓటు అనే ఆయుధంతో అరాచక, అన్యాయ వైసీపీని రాష్ట్రంనుంచి తరిమికొడదాం' అని పిలుపునిచ్చారు.

నేడు ప్రధాని మోదీ రాక

తిరుపతి(కలెక్టరేట్), మే 7: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి హైదరాబాదు నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.55గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకోనున్నారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 3.40గంటలకు అన్నమయ్య జిల్లా కలికిరికి వెళతారు. ఎన్నికల బహిరంగ సభలో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో 5.20గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్లనున్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 26మందికి నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న పీవో, ఏపీవోలకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ తరగతులకు ఎలాంటి కారణం చూపకుండా గైర్హాజరైన పీవో, ఏపీవోలు 26మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారినుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోతే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో కాలుజారిపడి విద్యార్థి మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, మే 7: చెరువులో కాలుజారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలంలోని చిన్నరామాపురం హరిజనవాడకు చెందిన ప్రవీణ్‌కుమార్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తండ్రి మృతి చెందడంతో తల్లి సునీత జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లింది. దాంతో చిన్నరామాపురంలోని తన అక్క, బావ ప్రవీణ్ ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి మూలపల్లె చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయాడు. స్నేహితులు గాలించినా ప్రయోజనం లేకపోయింది. గజ ఈతగాళ్లను రప్పించి గాలిస్తే ప్రవీణ్ మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు సభ సక్సెస్

తెలుగు తమ్ముళ్లలో పెరిగిన జోష్



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

పుంగనూరు, మే 7: పుంగనూరు వీధుల్లో పసుపుజెండా రెపరెపలాడింది. పట్టణమంతా పసుపుమయంగా మారింది. గతేడాది ఆగస్టు 4న చంద్రబాబునాయుడు పూతలపట్టుకు వెళ్లే క్రమంలో పుంగనూరు వద్ద టీడీపీ శ్రేణులు, పోలీసుల మధ్య జరిగిన గొడవ రణరంగంగా మారింది. ఆ సమయంలో టీడీపీ శ్రేణులు పుంగనూరుకు రావాలంటూ ఆహ్వానించగా త్వరలోనే వస్తానని వెళ్లారు. అనంతరం పోలీసులు ఇష్టారాజ్యంగా నమోదుచేసిన కేసులతో టీడీపీ జెండా పట్టాలంటేనే శ్రేణులు భయపడే పరిస్థితి. ఈ క్రమంలో మంగళవారం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మోటారు సైకిళ్లు, వాహనాలు, బస్సుల్లో టీడీపీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. వీరిలో ఉత్సాహం ఉరకలేసింది. సభ జరిగినంత సేపూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఆనందంతో కేరింతలు కొడుతూ కనిపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పాపాల పెద్దిరెడ్డి అంటూ సంబోధిస్తూ తీవ్రస్థాయిలో చంద్రబాబు విమర్శలు చేయడంతో సభికుల నుంచి విశేషస్పందన లభించింది. సీఎం జగన్‌ను జగ్గూబాయ్ అన డం, పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డికి బానిసలు కాదని, ఇక్కడి ప్రజల్లో పౌరుషం ఉందా అంటూ పలుమార్లు జనాన్ని ప్రశ్నించారు. పుంగనూరు నుంచే పెద్దిరెడ్డి రాజకీయ పతనం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. జనం స్పందన గమనిస్తూ నాలుగు వైపులా తిరుగుతూ చిరునవ్వుతో చంద్రబాబు కనిపించారు.

ఐదేళ్ల తర్వాత..

2019 ఎన్నికల సమయంలో పుంగనూరు మండలం సింగిరిగుంట వద్ద చంద్రబాబునాయుడు హంద్రీనీవా జలాలకు పూజలు చేశారు. నాటి టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిని గెలిపించాలని ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇప్పుడు పుంగనూరు వచ్చారు. పుంగనూరు కేంద్రంగా మంత్రి పెద్దిరెడ్డి ఆయన కుమారుడు ఎంపీ మిధున్‌రెడ్డికి వస్తున్న అవినీతి ఆదాయాన్ని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి లెక్క కట్టి ప్రజలకు వివరించారు. మాజీ సీఎంలు చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి సభ సందర్భంగా ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసుల పహారా, నిఘా, సీఆర్పీఎఫ్ పోలీసుల బందోబస్తుతో ప్రశాంతగా చంద్రబాబు పర్యటన ముగిసింది. భారీగా పోలీసు బలగాలు రావడంతో పార్టీ శ్రేణుల్లో చంద్రబాబు సీఎం కాబోతున్నారని తెలిసి భద్రత పెరిగిందనే చర్చ జరిగింది.

ఆ రెండ్రోజులు మద్యం అమ్మకాలపై నిషేధం

అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 7: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 11న సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు మద్యం అమ్మకాలపై నిషేధం విధించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ, సెబ్ అధికారులతో సమీక్షించారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా ప్రజలు 91771 19097 నెంబరుకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఈబీ జిల్లా అధికారి రాజేంద్ర, ఎక్సైజ్‌సూపరింటెండెంట్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకూ అనుమతి తప్పనిసరి

ఎంసీఎంసీ ముందస్తు అనుమతి లేకుండా ఈనెల 13 (పోలింగ్ జరిగే రోజు), 12 (పోలింగ్ ముందు రోజు) తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ప్రచురించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల చివరి దశలో అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే ప్రకటనల వల్ల ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిషన్ గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబం వేల కోట్లను దోచేసింది

● పుంగనూరు సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

పుంగనూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): 'మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంట్రాక్టర్లు వీళ్లే. ఇసుక, మద్యం, మైనింగ్ వ్యాపారాలు వీళ్లవే. ఇలా పెద్దిరెడ్డి కుటుంబం రూ.వేల కోట్లను దోచేసింది' అని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. పుంగనూరులో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. 'పుంగనూరులో దాడులు జరగని రోజు, అక్రమ కేసులు పెట్టని రోజు, అరెస్టులు జరగని రోజు లేదు. చౌడేపల్లె బస్టాండు వద్ద టీడీపీ జెండా దిమ్మె తొలగించారు. సదుంలో టీడీపీ నేత రాజారెడ్డిని కిడ్నాప్ చేసి కొట్టారు. పుంగనూరులో టీడీపీ కార్యాలయానికి భవనం అద్దెకిచ్చిన యజమానిని బెదిరించి ఖాళీ చేయించారు. పెద్దిరెడ్డికి స్వాగత బ్యానర్లను తన ఇంటి వద్ద కట్టొద్దని చెప్పినందుకు నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. మృత్యుంజయ స్వామి ఆలయాన్ని పునర్నిర్మించిన టీడీపీ నేత రమణారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో చల్లా బాబుపై దాడిచేసి 13 మందిపై కేసులు పెట్టారు. వైసీపీ జెండా కట్టొద్దని చెప్పినందుకు చౌడేపల్లె టీడీపీ నేత రమేష్‌రెడ్డి సహా 41 మంది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

మూడ్రోజుల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,832

ఎన్నికల డ్యూటీ ఓటర్లు 16,201, ఎసెన్షియల్ 554... హోమ్ ఓటర్లు 1077

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆది, సోమ, మంగళవారాల్లో పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు 17,832 పోలయ్యాయి. ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు 16,201 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు 554 మంది, 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, కదల్లేని స్థితిలోని రోగులు, దివ్యాంగుల కేటగిరీలో 1,077 మంది చొప్పున ఓటు వేశారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 4,191 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఎన్నికల విధుల్లో ఉండి.. పోస్టల్ బ్యాలెట్‌కోసం దరఖాస్తు చేయని ఉద్యోగులు, దరఖాస్తు చేసి తిరస్కరణకు గురైన ఉద్యోగులు బుధవారం కూడా దరఖాస్తు చేసి ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. దీంతో బుధవారం కూడా ఈ కేటగిరీకి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశముంది.

ఇంట్లో లేనివారికి మరో అవకాశం

తిరుపతి(కలెక్టరేట్): జిల్లాలో 1,139మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజైన సోమవారం 955మంది ఓటు హక్కు వినియోగించుకున్న విషయం తెలిసిందే. రెండోరోజైన మంగళవారం ఏడు నియోజకవర్గాల పరిధిలో 122మంది ఓటేశారు. మొత్తం 1,077మంది హోంఓటింగ్ వినియోగించుకున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. అయితే కొంత మంది వృద్ధులు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండటం, ఊరిలో లేనివారికి ఈనెల12వ తేదీలోపు మరోసారి హోంఓటింగ్ అవకాశం కల్పించనున్నారు.

పోలైన ఓట్ల వివరాలిలా..

సెగ్మెంట్	ఎన్నికల డ్యూటీ ఓటర్లు	ఎమర్జెన్సీ సర్వీసుల ఓటర్లు	హోమ్ ఓటర్లు
గూడూరు	2297	058	094
సూళ్ళూరుపేట	1703	034	175
వెంకటగిరి	1797	051	364
తిరుపతి	3545	099	084
శ్రీకాళహస్తి	2289	085	153
సత్యవేడు	1201	106	062
చంద్రగిరి	3369	121	145
మొత్తం	16201	554	1077

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మన్నెం శ్రీనివాసులు నాయుడు



మన్నెం శ్రీనివాసులు నాయుడిని అభినందిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన తిరుపతికి చెందిన పార్టీ సీనియర్ నేత మన్నెం శ్రీనివాసుల నాయుడిని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభినందించారు. గతంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి తనదైన ముద్రవేసుకున్న ఆయనను పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం తన వంతు కృషిచేస్తానని, అవకాశం కల్పించిన నాయకులకు మన్నెం కృతజ్ఞతలు తెలిపారు.